# మరక

## శివజ్యోతి

**"నువ్వు పుష్పవతివ య్యావమ్మా!'' అంది అమ్మమ్మ నన్నోసారి పరిశీలనగా చూస్తూ. అంటే ఏంటో ఆ వయసులో అర్థం కాక నేనలాగే నిలబడిపోయాను.**

**'ముట్టయ్యావమ్మాయ్, ముట్టుకోమాకు దూరంగా ఉండు!' అంటూ అమ్మమ్మ దూరం జరిగేసరికి సిగ్గుతో ముడుచుకుపోయాను. నన్నో మూలన కూర్చోబెట్టి, బయటికెళ్ళి ఇంటిపక్కన వున్న నలుగురాడవాళ్ళను పిలుచుకొచ్చింది అమ్మమ్మ. వాళ్ళు నన్ను చూసి ముసిముసి నవ్వులు నవ్వుతూంటే వాళ్ళ వైపు చూడలేక తలదించేసుకున్నాను నేను. అప్పటికి నాకు బహుశ పదమూడేళ్ళు వుండి వుండొచ్చు.**

ఇంతలో తాతయ్య గోడకున్న కేలండర్ వైపు చూసి

"ఏమేవ్! ఇది అష్టమినాడు పెద్ద మనిషియ్యందే!" అన్నాడు.ఆ మాటతో అమ్మమ్మ ముఖం మాడిపోయింది.

'దీని జాతకమే అంత పాడుపిల్ల! అందుకేనేమో ఎప్పుడూ దీనికి రోగాలూ, రొష్టలూనూ-"

ఎప్పుడు ప్రేమగా మాట్లాడే అమ్మమ్మా, తాతయ్యా ఆ రోజెందుకలా మాట్లాడుతున్నారో అర్థం కాక మనసంతా బాధతో నిండిపోయింది. ఎందుకో ఆ క్షణం నా దగ్గర అమ్మ ఉంటే బావుండేదనిపించింది.

అప్పట్లో ప్రతి సంవత్సరం వేసవి సెలవులకి అమ్మమ్మ వాళ్ళ ఊరు రాఘవాపురం రావటం అలవాటు నాకు.

చెల్లీ, నేనూ కలిసి వచ్చామంటే మళ్లీ సెలవులైపోయాకే జగ్గయ్యపేట తిరిగి వెళ్లిపోయేవాళ్ళం. నాన్న జగ్గయ్యపేటలో టీచరుగా పనిచేసేవాడు. ఎప్పుడైనా నాన్నకూ సెలవులు దొరికితే అమ్మానాన్నలతో కలిసే వచ్చే వాళ్ళం అమ్మమ్మ ఇంటికి.

నందిగామలో బస్సు దిగి మూడు మైళ్ళు నడిస్తే రాఘవాపురం. అమ్మమ్మనీ తాతయ్యనీ చూస్తామన్న ఆనందంతో ఆ మూడు మైళ్ళూ చకచకా నడిచేవాళ్ళం. నాకూ చెల్లెలికీ ఆ మూడు మైళ్ళూ నడవటం గొప్ప సరదా. అమ్మమ్మా తాతయ్యల కోసం అమ్మ తయారు చేసిన పిండి వంటకాల్ని టిఫిన్ కేరేజీల్లో పెట్టుకొని చెరొకటి వంతులుగా మోస్తూ నడిచే వాళ్ళం.

మధ్యలో వచ్చే వాగులో మోకాలు లోతు నీళ్ళలో దిగి ఆనందిస్తూ, జలగలుంటాయన్న అమ్మమ్మ మాటలు గుర్తొచ్చి మళ్ళీ భయపడి పరుగెత్తేవాళ్ళం. దారికి రెండు వైపులా మామిడి తోటలుండేవి. బంగనపల్లీ, తోతాపురీ, మామిడిపళ్ళు నోరూరిస్తుంటే దొంగతనంగా వెళ్ళి నేనూ, చెల్లీ పోటీపడి కోసుకొచ్చేవాళ్ళం. అమ్మమ్మ ఇంటికి వెళ్ళటమే ఆలస్యం లగేజి ఇంట్లో పడేసి ఊరు చివరున్న సివసింతకాయల చెట్ల దగ్గరకెళ్ళి అవి తినుకుంటూ పొద్దుపోయేదాకా గడిపేవాళ్ళం. మరో రోజు ఏట్లోకెళ్ళి చెలమల్లో నీళ్ళు త్రాగుతూ ఆడుకునే వాళ్ళం. వానాకాలంలో వరదలా ఉప్పొంగి ఆ చుట్టుపక్కల పొలాలనెన్నిటినో ముంచేసే ఆ ఏట్లో ఎండాకాలం కాళ్ళు తడుపుకోటాన్కి కూడా నీళ్ళు లేకపోవటం చూసి ఆశ్చర్య పోయేవాళ్ళం. ఇపుడు మామిడి తోటలూ, సివసింత చెట్లూ ఎలా అదృశ్యమయ్యాయో కానీ, చివరికి ఏట్లో ఇసుక కూడా కనిపించదు.

'పడ్డల్లాగా (దున్నపోతుల్లా) ఎంతసేపు పడుకుంటారే! తెల్లారింది లేవండంటూ అమ్మమ్మ పిలిచే సరికి బద్ధకంగా నిద్ర లేచానారోజు.

"అమ్మడూ! సత్యంగారి దొడ్లో చింత చెట్టు వుంది. మీరిద్దరూ వెళ్ళి చిగురు కోసుకొస్తారా!' అంది అమ్మమ్మ. సరేనని ఓ చిన్న బుట్ట తీసుకొని నేనూ చెల్లాయి వెళ్ళాం. ఓ కొమ్మ మీదికెక్కి చిగురుకోస్తూంటే అనుకోకుండా నా దృష్టి నా లంగా మీద పడింది. ఎర్రని మరక కనిపించడంతో నాకేమీ అర్థం కాలేదు. ఏమైనా దెబ్బ తగిలిందా? లేక ముల్లు గుచ్చుకుందా? మరి నొప్పెట్టలేదే...? అలా రకరకాల అనుమానాల్తో అమ్మమ్మ దాకా పరుగెత్తుకొచ్చేశాను.

తాతయ్య హడావిడిగా బయటికెళ్ళి బంధువులందరికీ ఉత్తరాలు రాశాడు. అలా ఉత్తరాలతో మొదలైన ప్రచార హంగామా ఇంటింటికి బొట్టుపెట్టి 'సాయంత్రం మా అమ్మాయిని కూర్చోబెడ్తున్నాం రండి వదినగారూ..!' అంటూ మా చిన్నమ్మ పిలవడంతో ఊపందుకుంది. చూస్తుండగానే ఇల్లంతా సందడి. నా స్నేహితురాళ్ళంతా చుట్టూ గుమిగూడి నన్ను వింతగా చూడటం మొదలెట్టారు.

"కన్నీ! నువ్వు పెద్ద మనిషివయ్యావటగదా!' అని పప్పీ అంటూంటే అదేదో పొగడ్తనుకొని పొంగిపోయాను.



"అయ్యో! ఇది సుందరి రెండో బిడ్డకదూ! పెద్దదాని పెళ్ళింకా కాలేదనుకుంటా. రెండో దానికి ఈడొచ్చేసింది! మీ అల్లుడికి మరో కుంపటి మొదలయ్యిందన్నమాట" అంటూ మా అమ్మమ్మను పరామర్శిస్తూ, మా నాన్న మీద జాలి కురిపించింది ఇంటి పక్కనున్న గాయత్రమ్మ వదిన. ఆడపిల్లల తండ్రని మా పెళ్ళిళ్ళయ్యాక కూడా మా నాన్న మీద జాలి పడుతూంటుందావిడ.

'ఖర్చు వచ్చి పడ్డది' అని ఒకరు.

'పెళ్ళికి రడీ అన్నమాట. పాపం మీ అల్లుడికి బాధ్యతలు బాగానే ఉన్నట్టున్నాయ'ని మరొకరు.

'అలా నవ్వకూడదు. ఇంకా చిన్న పిల్లలూ అలా అల్లరి చేయకూడదం'టూ దీర్ఘాలు తీసింది నాకు చిన్నప్పుడు పాఠాలు చెప్పిన భాగ్యమ్మ టీచరు.

'ఏం? ఎందుకు?' అన్నాను.

'ఇప్పుడు పుష్పం వికసిస్తుంది కాబట్టి' అంది. నాకేం అర్థం కాలేదు. అప్పటికే ఏమీ తినని నాలో ఆకలి తన్నుకొస్తూంది. నేను చాలా సున్నితం. మా నాన్న అంటూండేవారు 'ఆకలైనా, నిద్రొచ్చినా దేనికీ ఆగలేవురా కన్నీ! ఎలా బతుకుతావో ఏమో!' అని 'అమ్మమ్మా! ఆకలేస్తుందం'టూ వంటింటి వైపు వెళ్దామని లేచాను.

'అయ్యో అయ్యో! అని నా చుట్టూ వున్న వాళ్ళంతా వెనక్కి జరిగి, ఎక్కడికి వెళ్ళకూడదు. ఈ పదకొండు రోజులూ అలా దూరంగానే కూర్చోవాలి' అంటూ నన్నా మూలనే కదలకుండా కూర్చోబెట్టారు. ఏ వస్తువునూ ముట్టుకోనిచ్చేవారు కాదు. పొరపాటున దేన్నైనా ముట్టుకుంటే దాని మీద పసుపునీళ్ళు చల్లేవారు. బాత్రూంకెళ్ళినా వెళ్ళొచ్చే దారిలో పసుపు నీళ్ళు చల్లేవారు ఇల్లంతా మైలపడిపోతుందని నా ముఖంలో నవ్వు కాస్త మాయమైంది. నన్నందరూ అంటరాని దాన్ని చేయటం, ఆకలౌతున్నా అన్నం పెట్టకపోవటం, అసలే అమ్మా నాన్నలకి దూరంగా ఉండటం.. నా స్థితి చూసుకుంటే నాకే జాలి కలిగింది.

మీ అమ్మ వస్తే నన్నిలా ఉండనివ్వకపోయేది కదా అని అనుకునే సరికి ఏడుపు తన్నుకొచ్చింది.

'అలా ఏడవ కూడదు' అంటూ గద్దించింది అమ్మమ్మ.

స్నేహితురాళ్ళతో బయటికి వెళ్లానంటే వెళ్ళనివ్వ కాదు. కనీసం తనకు దగ్గరగా కూచోడానికీ ఒప్పుకోలేదు. నాకెందుకో అమ్మమ్మ మీద కోపమొచ్చింది.



**

మొదటి రోజు కార్యక్రమం నాకిప్పటికీ చాలా స్పష్టంగా గుర్తుంది. ఒక తెల్లని పాత పంచెను అమ్మమ్మ నా చేతిలోకి ఎత్తివడవేసింది. దాన్ని మూలన పరిచాను. తాంబాళంలో బియ్యం, కొబ్బరీ, బెల్లం, తమలపాకులూ, వక్కలూ, సున్నం, నూనె, పసుపువగైరాలన్నింటినీ నాకు కొద్ది దూరంలో అమర్చారు.

"ఆ ఐదుగురు ముత్తైదువలు ఎలా చెబితే అలాగే చెయ్యమ్మా!" అంది అమ్మమ్మ.

వాళ్ళు నా దోసిలి పట్టమని దాంట్లో కొద్దిగా పసుపూ, నూనెలని వంతుల వారీగా వేస్తూ పోయారు. దాన్ని కలిపి నా ముఖానికి రాసుకోమన్నారు. తరువాత 'బొట్టుపెడతాం' అంటే తిలకం కోసం చేయి చాచాను. 'చేతిలో కూడదు' అంటూ అద్దం పట్టమని అద్దం మీద కుంకుమ వేశారు. వాళ్ళు నాకాళ్ళకు పారాణి పెట్టింస్తూంటే తెల్లని సున్నం పసుపుకి తగలగానే ఎరుపుగా మారుతుండటం చూసి ఆశ్చర్యపోయాను. అమ్మమ్మ నా చేత ఓణీ కట్టించి, ఒక చెక్క బొమ్మని 'తోడుగా ఉంచుకోమ్మా' అంటూ నా ఒళ్లో ఉంచింది. మూడు దోసిళ్ళ బియ్యం నా చేతిలో పోసి, పరచిన పంచె మధ్యలో పోయమంది. కొబ్బరి చిప్పలో బెల్లం పెట్టి ఆ బియ్యం కుప్ప మీద పెట్టమంది. బియ్యం,కొబ్బరీ, బెల్లాన్ని నాలుగు మూలలా పెట్టించారు నా చేత ఆ ఐదుగురు ముత్తైదువలూ కలిసి. చేతులకు పసుపూ,నూనెలను రాయించి నన్ను గోడకి కూచోబెట్టి, చేతుల్ని వెనక్కి పెట్టించి గోడమీద తలక్రిందులుగా అచ్చులు వేయించారు. నా ఎదురుగా ఒక రోలు నుంచి దాంట్లో కొబ్బరీ, బెల్లం, నువ్వులనీ కలిపి దంచుతూ సువ్వి పాటలు పాడారు.

దంచిన ముద్దని నా చేతిలో పెట్టి తినమంది అమ్మమ్మ. అసలే స్వీటు తినడం ఇష్టం లేని నేను నాకొద్దు అన్నాను. 'తప్పు అలా అనకూడదు!' అంటూ చేతిలోకి వేసింది. ఆకలి రుచి ఎరుగదేమో కానీ అంత ఆకలిలోనూ వికారం కలిగించింది ఆ కొబ్బరి ముద్ద. నా ఆకలి తీరలేదు సరికదా కడుపులో మెల్లగా నొప్పి మొదలైంది. విలవిలలాడుతూ మెలికలు తిరిగిపోయాను. ఎవరూ ముట్టుకోరు. అదే తగ్గిపోతుందిలే అని అంటుంది అమ్మమ్మ. మూల్గుతూ కాళ్ళని పొట్టలో పెట్టుకొని కూర్చున్నాను.

ఒక మట్టి ముంత తెచ్చి నా చేతిలో ఎత్తి పెట్టింది అమ్మమ్మ. దాంట్లో ఉప్పు లేకుండా నువ్వులతో కలిపి వండిన అన్నాన్ని కొద్దిగా పెట్టి తినమంది. 'చవ్వగా ఉంది. నాకొద్దు' అని ముందుకు నెట్టాను. పోనీ ఏదైనా పచ్చడి వెయ్యి అంటే 'కారం తింటే కడుపులో నొస్తుంది. ఈ మూడు రోజులూ నువ్విలానే తినాలి' అంది.

ఏదీ సరిపడని నేను ఆకలిని చంపటం మొదలెట్టాను.

పేరంటాళ్ళందరికి వాయానాలిచ్చి పంపడంతో ఆ రోజు సాయంత్రం సద్దుమణిగింది.

నాలో ఒంటరితనం, భయం, విసుగూ, బాధా... ఇంకా ఏవేవో లక్షణాలు బాధిస్తుంటే అట్లే నిద్రపోయాను. అర్ధరాత్రి ఉలిక్కిపడి లేచి చూస్తే చుట్టూ బియ్యానికి పట్టిన చీమలు. అసహనంగా లేచి నిలబడ్డాను. అసలే పాతకాలం నాటి పెద్ద ఇల్లు. ఆ చీకట్లో నాకెందుకో భయమేసింది. ఇంతలో నా పక్కగా గోడకి వున్న తూములో ఏదో కదుల్తున్నట్లనిపించి 'అమ్మమ్మా!' అంటూ కేకేశాను.

నా చుట్టూ ఎవరూ లేరు. అందరూ ఆరు బయట గాలిలో హాయిగా నిద్రపోతున్నారు. నాకు భయం ఎక్కువైంది. తలుపుకొట్టి అమ్మమ్మను లేపాను.

'ఏమిటే!' అని విసుక్కుంటూ లేచొచ్చింది.

తూములో ఏదో కదులుతూంది అన్నాను. లైటు వేసి చూద్దునుగదా పెద్ద జెర్రి కదులుతూ కనిపించింది. పరుగెత్తి పక్కకు వచ్చాను. దాన్ని చంపిన తర్వాత కూడా నాలో భయం పోలేదు.

'నేనొక్కదాన్ని పండుకోను, నాకు భయమేస్తుంద'ని ఏడ్చాను.

నాలోని బాధ కచ్చిగా మారింది.

సరే అని దయతలచి ఒక చెక్క బల్ల ఇచ్చారు పడుకోటానికి. ఎలాగోలా అమ్మమ్మను ఒప్పించి, చుట్టూ బియ్యం కోసం బారులు తీరిన చీమల్ని దులిపి, బియ్యాన్ని మూటకట్టి ఓ పక్కన బెట్టాను. నాకు తోడుగా మా పని మనిషి ఫకీరమ్మని ఇంట్లో పడుకోమన్నారు. ఆ క్షణంలో ఎంతమంది బంధువులున్నా నా ఆత్మ బంధువు మాత్రం ఫకీరమ్మే అనిపించింది.

***

కిటికీలోంచి నను వెచ్చగా తాకిన సూర్యకిరణాలు నన్ను నిద్ర నుంచి మేల్కొల్పాయి. గోడలకు వేలాడదీసిన పటాల చాటున తమ గూళ్ళలో నిద్రిస్తున్న పిచ్చుకలు కిచకిచ శబ్దాలతో జీవన సమరంలోకి రయ్‌ని దూసుకెళ్ళాయి. 'అమ్మాయిగారూ! నేను వెళ్తానంటూ బయలుదేరింది ఫకీరమ్మ. 'అమ్మమ్మకు నేను స్నానం చేస్తానని చెప్పు' అన్నాను. సరేనంటూ వెళ్ళిపోయింది.

ఇంతలో అటుగా వచ్చిన అమ్మమ్మ 'లేదమ్మా' ఈ మూడు రోజులూ స్నానం చేయకూడదు' అంది.

ఇప్పటిలా రక్తం మరకలు వికారాన్ని కలిగించేవి. అలవాటు లేని పైట భుజం మీద నిలిచేది కాదు. తీసేస్తానంటే ఒప్పుకోరు. నాకు ఒంటరిగా అనిపించి చాలా బాధేసింది.

అసలే తిండి లేదు. పైగా వాంతులు మొదలయ్యాయి. అప్పుడప్పుడు పొత్తి కడుపులో విపరీతమైన నొప్పి. అమ్మమ్మకు చెబితే అలాగే ఉంటుంది లేమ్మా అనేది. నాకు మళ్లీ ఏడుపొచ్చింది.

* * *

అమ్మా, నాన్నా, అక్కయ్యా బంధు వర్గమంతా రావడంతో మళ్లీ నా ముఖంలో నవ్వు విరిసింది. పది మందితో కలిసిపోయే మనస్తత్వమున్న నాకు అది ఆనందాన్నిచ్చింది. అమ్మను చూడగానే పట్టుకొని ఏడ్చేశాను. అమ్మ నన్ను కౌగిలించుకొని 'పర్వాలేదమ్మా! నీకిక భయం లేదు. నేనున్నాగా' అని తనూ కొంగుతో కళ్ళనొత్తుకుంది.

ఇంతలో అక్కడికొచ్చిన అమ్మమ్మ.

'ఏంటే నువ్‌గూడా సుందరీ! దానికి చెప్పాల్సింది పోయి ఏదో ఘోరం జరిగినట్టు నవ్వా ఏడుస్తావేం' అంది కోపంగా చూస్తూ.

* * *

ఇంతలో మూడో రోజు రానే వచ్చింది. సూర్యోదయానికి ముందే స్నాన కార్యక్రమం మొదలైంది. తలంటుపోసుకోడం రాని నాకు ఫకీరమ్మేతలంటుపోసింది. మూడు రోజుల మట్టీ, మరకలూ శరీరాన్నొదిలే సరికి కొద్దిగా - ఉత్సాహంగా అనిపించింది. కాని నా దురదృష్టమా అని వేసవి ఎండల వల్లనో లేక గాలి లేని చీకటి గదిలో కూర్చోవడం వల్లనో ఏమోగానీ నా ముఖం నిండా సెగ గడ్డలు లేచాయి.

పిల్లలంతా ఏటికి బయల్దేరారు. కాలకృత్యాలు తీర్చుకోటాన్కి తప్ప గదిలోంచి బయటికెళ్ళనీయని నన్ను ఏటికేం వెళ్ళనిస్తారు? ఉన్నట్టుండి ఈ పెద్దాళ్ళంతా ఇంత నిర్దయులై పోయారేంటా అని అనిపించింది.

అమ్మమ్మ ఎంత ప్రేమగా ఉండేదో! స్నేహితురాళ్ళతో కలిసి నీళ్ళు తేవడానికి బిందెల్తో ఏటికి బయల్దేరుతూంటే అమ్మమ్మ ఇంట్లోకి పిలిచి రెండు మూడు మామిడి పళ్ళు పెద్ద రసాలు ఇచ్చేది. ఏటికి పోయే సంబరంలో ఆ పండ్లను బిందెల్లో వేసుకొని బయలుదేరేవాళ్ళం. ఏటి దగ్గర రేగిచెట్లదగ్గర రేగిపండ్లు కోసుకొని తింటూ గంటలు గంటలు గడిపేవాళ్ళం. ఇసుకలో పిచ్చుక గూళ్ళు కడుతూ, పల్చని వెడల్పాటి రాళ్ళను ఏరి ఏట్లో నీటి అలలపైన గెంతేట్టుగా విసురుతూ ఆనందించే వాళ్ళం. ఆటలాడీ, పాటలు పాడీ ఎప్పుడో పొద్దు పోయాక గూటికి చేరే వాళ్ళం. అలాంటిది చీకట్లో అలా ఓ మూలన కదలకుండా కూర్చోటం కష్టమై పోయింది. కాళ్ళనెవరో తాళ్ళతో కట్టేసినట్టయింది.

ఏటికి పోయే సంబరంలో ఆ పండ్లను బిందెల్లో వేసుకొని బయలుదేరేవాళ్ళం. ఏటి దగ్గర రేగిచెట్లదగ్గర రేగిపండ్లు కోసుకొని తింటూ గంటలు గంటలు గడిపేవాళ్ళం. ఇసుకలో పిచ్చుక గూళ్ళు కడుతూ, పల్చని వెడల్పాటి రాళ్ళను ఏరి ఏట్లో నీటి అలలపైన గెంతేట్టుగా విసురుతూ ఆనందించే వాళ్ళం. ఆటలాడీ, పాటలు పాడీ ఎప్పుడో పొద్దు పోయాక గూటికి చేరేవాళ్ళం. అలాంటిది చీకట్లో అలా ఓ మూలన కదలకుండా కూర్చోటం కష్టమై పోయింది. కాళ్ళనెవరో తాళ్ళతో కట్టేసినట్టయింది.

అమ్మమ్మలాంటి వాళ్ళను సానుభూతితో ఎలా అర్థం చేసుకోవాలో ఆ వయసులో నాకు తెలియ లేదు.

* * *

పెద్ద వాళ్ళంతా కూర్చుని చర్చలు మొదలెట్టారు. పదకొండో రోజు వరకూ మిగతా కార్యక్రమాలు ఎలా చేయాలీ, ఎంత ఖర్చు పెట్టాలీ, బంధువులకు బట్టలూ, మిగతా మర్యాదలూ, ముత్తైదువలకు లాంఛనాలూ మొదలైనవన్నీ లెక్కలు గడుతూ కూర్చున్నారు. అవన్నీ వింటూంటే మా నాన్నకు ఖర్చు తడిసి మోపడయ్యేటట్లునిపించింది. మా నాన్న 'నేనీ ఫంక్షన్స్ అన్నీ చేయలేను' అనడేం అని నా మనసు ఆక్రోశించింది.

'నీకు పట్టులంగా, ఓణీ కొనియ్యనా లేక బంగారు గొలుసు చేయించనా' అని అడిగారు నాన్న.

'నాకివేం వద్దు' అన్నాను నిక్కచ్చిగా.

'దానిమొహం. దానికేం తెలుసు' అన్నాడో పెద్దాయన. అన్నీ సంప్రదాయం ప్రకారం జరగాల్సిందేనని తేల్చేశారు పెద్దలంతా పెద్దలంతా కలిసి.

మా ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగా లేదనే విషయం నాకు తెలుసు. నాన్న అన్ని విషయాలూ అమ్మతో, అక్కతో మాట్లాడుతుంటే వింటూండేదాన్ని. ఖర్చు విషయంలో నన్నూ జాగ్రత్తగా ఉండమని పదే పదే చెబుతూండేది అమ్మ. పెద్దలంతా నిర్ణయించాక మౌనంగా ఉండి పోయింది అమ్మ కూడా.

* * *

ఆ రోజు ఐదవ రోజు. 'చీర కుట్టించాలట' అంది అమ్మ 'నాకొద్దు' అన్నాను నేను.

అయిదడుగుల ఎత్తున్న నాకు ఆరు మీటర్ల చీర కట్టుకోటం చాత కాలేదు. ఫకీరమ్మే చీర కట్టింది. చీర కట్టాక ఫకీరమ్మను స్నానం చేసే వరకు వదల్లేదు మా అమ్మమ్మ. మళ్ళీ చిమ్మిరి తొక్కటం, మంగళహారతులూ, వాయనాలూ....

'పిల్ల ముఖంలో యవ్వనం కనబడుతుంది' అని ఒకామె.

'మీ అబ్బాయికి చేసుకోరాదూ!' అంటూ మరొకామె. ఆ హడావిడి అంతా ముగిసేసరికి ఓ తుఫాను వెలిసినట్టనిపించింది నాకు.

ఎందుకో నాకు మరీ ఒంటరిగా అనిపించింది.

నాకు ఎవరూ లేరనిపించింది. నేనెక్కడికెళ్ళినా నా వెనకనే. నడిచిన చోటల్లా పసుపునీళ్ళు చల్లుతూ ఎవరో ఒకరు రావటం మానలేదు. నన్ను ముట్టుకున్న వాళ్ళకు స్నానం చేయకా తప్పట్లేదు. ఇంకా ఆరు రోజులు ఎలా గడుస్తాయో తెలీని అయోమయంలో తొమ్మిదో రోజు వచ్చింది. ముఖం మీద గడ్డలు పెద్దవయ్యాయ్. వళ్ళంతా నొప్పి, శరీరం పాలిపోయింది. ఏడ్చి ఏడ్చి కళ్ళకింద నల్లని చారలు పడ్డాయి. కానీ ఎక్కడో కొద్దిగా ఆనందం, రెండు రోజుల్లో బయటి ప్రపంచంలోకి అడుగుపెడతానని.

* * *

ఎదురు చూస్తూన్న పదకొండో రోజు రానే వచ్చింది. పెద్ద వాళ్ళంతా ఫంక్షన్ హడావిడిలో పడిపోయారు. స్నానం చేయగానే పరుగెత్తి అమ్మనీ, చెల్లినీ, అక్కనీ ప్రేమగా తాకిన తర్వాతగానీ నా ఆరాటం చల్లారలేదు. మళ్ళీ నా ముఖంలో ఆనందం విరబూసింది. స్నేహితురాళ్ళొస్తే వాళ్ళతో చాలాసేపు కబుర్లు చెప్పుకుంటూ గడిపాను.

మా నాన్న ఎవరితోనో మాట్లాడుతూంటే దగ్గరికెళ్ళి నాన్న పక్కగా కూర్చున్నాను.

'ఇప్పుడిలా రాకూడదమ్మా! నువ్విన్నాళ్ళలా ఉండకూడదు. పెద్దదానవయ్యావ్!' అని అన్నాడు.

నాన్న ఎందుకలా మాట్లాడుతున్నాడో ఏమీ అర్థం కాక నేనలాగే కూర్చున్నాను.

బంధువుల రాకపోకలూ, వాయనాలూ, బట్టలు పెట్టటమూ తీసుకోవటమూ సాయంత్రానికల్లా ముగిసాయి.

* * *

నాన్నకు సెలవులు లేకపోవటం వల్ల మర్నాడే అందరం కలిసి జగ్గయ్యపేటకి తిరుగు ప్రయాణమయ్యాం. అమ్మమ్మా, తాతయ్యా వాగు వరకు తోడుగా నడుస్తూ వచ్చారు. అందరం వాగులో నడుస్తూన్నాం.

నేను మౌనంగా ఆలోచిస్తూ నడుస్తున్నా[illegible] నా శరీరంలో ఆ పదకొండు రోజులుగా సంభవించిన మార్పులు లీలగా అర్థమవుతున్నాయ్. మొదటి రోజునుంచి చివరి రోజు వరకూ జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటీ జ్ఞాపకమొస్తున్నాయ్.

మరొక్కసారి ఆ చీకటిగానీ, బియ్యంలో బారులు తీరిన చీమలూ, తూములోంచి వచ్చిన జెర్రీ గుర్తొచ్చి ఒళ్ళు జలదరించింది.

ఇంతలో అమ్మమ్మ, అమ్మను దగ్గరికి పిలిచి అంది.

"ఇంకో పది ముట్ల వరకూ పిల్లను దూరంగానే కూర్చోబెట్టు. ముట్ల అంటుతో ఇల్లంతా మైల చేయకు."

ఆ మాటవిన్న నేను నిలువెల్లా వణికిపోయాను. కోపంతో కళ్ళెర్రబడ్డాయి. ఆవేశాన్ని పళ్ళసందున నొక్కిపట్టి, కొద్దిసేపటికి సంబాళించుకొని.

"నేను దూరంగా కూర్చునే ప్రసక్తే లేదు.

ఏం చేస్తారో చేసుకోండి." అంటూ విసురుగా ముందుకు నడిచాను.

* * *

ఇపుడు రక్తస్రావానికీ, మరకలకూ అలవాటు పడిపోయాను నేను. కానీ ఆ పదమూడేళ్ళ వయసులో నన్ను విపరీతమైన ఆందోళనకు గురిచేసిన ఆ మొట్ట మొదటి మరకను మర్చిపోలేదు. అది నా బాల్యాన్ని నా నుండి తెంచేసిన మరక. నా బాల్యపు తీపి జ్ఞాపకాలకంటిన మాయని మరక.

అప్పటి నా సంఘర్షణనంతా అమ్మమ్మకు అర్థమయ్యేలా చెప్పగలనిప్పుడు నేను. కాని అర్థం చేసుకోడానికి అమ్మమ్మే లేకుండా పోయింది.